

'ఉపాధి' నిధులతో శాశ్వత వనరుల సృష్టి

శ్రీకాకుళం రూరల్ : ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో శాశ్వత వనరులను సృష్టిస్తున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు బి.సుధాకరరావు అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలంలోని కుందువానిపేటలో చేపడుతున్న సిమెంట్ రహదారి పనులతో పాటు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, గోశాల పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో పాడి పశువుల పెంపకాన్ని ప్రోత్సహించే విధంగా గోశాలను ఉచితంగా నిర్మించి ఇస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో సిమెంట్ రహదారుల నిర్మాణంతో పాటు మురుగు కాలువల నిర్మాణాన్నీ చేపడుతున్నామని చెప్పారు. గ్రామాల్లో పేరుకుపోయిన చెత్త నుంచి సంపద తయారీని ఏర్పాటు చేస్తున్నామని, వీటివల్ల గ్రామాలు పరిశుభ్రంగా ఉండడంతో పాటు పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు.

నవ వసంతానికి సుస్వాగతం

- 2024కు వీడ్కోలు
- 2025 స్వాగత వేడుకల్లో యువత జోష్
- కేకులు కట్ చేసి సంబరాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కొత్త ఆలోచనలు... కొంగొత్త ఆశయాలు... నిన్నటి అనుభవాలు... రేపటికి గుణపాఠాలు... వీటన్నింటినీ బేరీజు వేసుకుకుంటూ 2024కి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి ఘన స్వాగతం కలికారు జిల్లా ప్రజలు. నవోత్సాహంతో మంగళవారం రాత్రి 12 గంటలకు నూతన సంవత్సరం 2025కు ఆహ్వానం పలికారు. కేకులు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. హ్యాపీ న్యూ ఇయర్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. గతం మనకు కొంత మంచిని, కొంత చెడును మిగిల్చి ఉండొచ్చు. నూతనం అనే పదం కొత్తదనంతో పాటు భవిష్యత్ దర్శనానికి మార్గదర్శనం కావాలి. పాత అనే పదం భవిష్యత్ అనే భవంతికి పునాదిగా మారాలి. పాత, కొత్త కలయికలను నెమరువేసుకుంటూ జీవితాన్ని ఆశావహ దృక్పథంతో నిర్మించుకోవడం మనిషి లక్షణం కావాలి. గడిచిన ఏడాదిలో ఎంతోమందికి ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉంటాయి. మరికొందరికి చేదు అనుభవాలు కూడా ఉంటాయి. చేదు అనుభవాలను గురువుగా భావించి, మధుర జ్ఞాపకాలను పాఠ్యాంశాలుగా అనుకుంటే కొత్త జీవితం ప్రగతి మార్గంలో పయనిస్తుంది.

నూతనోత్సాహంతో...



శ్రీకాకుళం నగరంలో విక్రయిస్తున్న కేకులు

నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పట్టణాలు, పల్లెల్లోనూ ఏర్పాట్లు చేసుకున్నారు. రాత్రి 12 గంటలకు హ్యాపీ న్యూ ఇయర్ అంటూ కేకలు వేస్తూ యువత సంబరాలు చేసుకున్నారు. పట్టణ ప్రాంతాల్లో భారీగా కేకుల విక్రయాలు సాగాయి. ప్రధాన రోడ్లలో బేకరీల యాజమాన్యాలు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసి కేకులను విక్రయించారు. అర కేజీ కేకు రూ.150 మొదలుకొని విక్రయించారు. మిఠాయిలను భారీఎత్తున అందుబాటులోకి తెచ్చారు. బొకేలు, పూలదండలు ధరలు పెరిగాయి.



నవ్య పథంలో సాగుదాం

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి : జిల్లా ప్రజలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో అందరికీ సర్వ శుభాలు కలగాలని ఆకాంక్షించారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి మరింతగా ప్రాధాన్యం ఇచ్చి సంబంధిత ప్రణాళికల అమలుకు కార్యాచరణ అమలుకు కట్టుబడి పనిచేయనున్నానని తెలిపారు. తనతో పాటే అధికార, అనధికార యంత్రాంగం, కూటమి ప్రజాప్రతినిధులూ కార్మిక, కర్షక వర్గాల అభ్యున్నతికి పాటుపడతామని పేర్కొన్నారు.



కొత్త సంవత్సరానికి సైకత స్వాగతం

నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మండలంలోని గాజుల కొల్లివలసకు చెందిన సైకతశిల్పి గేదెల హరికృష్ణ కుమార్తె అఖిల సంగమేశ్వర స్వామి కొండ దిగువన వేసిన సైకత శిల్పం పలువురిని ఆకట్టుకుంది.

- ప్రజాశక్తి, ఆమదాలవలస

వలసల నివారణే లక్ష్యం

- జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాం
- కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - నందిగాం

జిల్లాలో వలసల నివారణ లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు తెలిపారు. మండలంలోని పెద్దతామరపల్లి కూడలి నుంచి నిర్వహించిన బైక్ ర్యాలీలో మంత్రులు పాల్గొన్నారు. ర్యాలీ మధ్యలో నవగం వద్ద రూ.8.50 లక్షలతో, కల్లాడ వద్ద రూ.4.50 లక్షలతో నిర్మిస్తున్న కల్వర్టుల నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. దీనబంధుపురం, మదనాపురంలో పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు, రైలు, జల, వాయు మార్గాల్లో జిల్లాకు కనెక్టివిటీని పెంచి అన్ని రంగాల్లోనూ ముఖ్యంగా పారిశ్రామిక రంగంలో అభివృద్ధిని సాధించి, జిల్లాను అత్యున్నత స్థానంలో నిలబెట్టడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. వాలంటీర్లు లేకపోతే పింఛన్లు ఇవ్వలేమని చెప్పారని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరు నెలల్లో ఒకటో తేదీ, ఆ ముందు రోజుల్లోనే ఇస్తున్నామని చెప్పారు.

ఉగాది నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం

ఉగాది నుంచి మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన సంక్షేమమని, వారి జీవన ప్రమాణాల పెంపునకు ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని చెప్పారు. పెద్దతామరాపల్లి నుంచి తూముకొండ మధ్య రెండు వరుసల రహదారి నిర్మిస్తామన్నారు. దీనబంధుపురం నుంచి దిమ్మిడిజోల, పెంటూరు నుంచి వేణుగోపాలపురం వరకు రహదారి నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పలాస నుంచి అమలాపురం వరకు త్వరలో బస్సు సర్వీసును ప్రారంభిస్తామన్నారు.



పింఛన్‌ను అందజేస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు

రూ.465 కోట్లతో ఇంటింటికి మంచినీరు

టెక్కలి నియోజకవర్గంలో రూ.465 కోట్లతో ఇంటింటికీ మంచినీటి సరఫరాను అందించడానికి ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణానికి 2014- 2019 మధ్య రూ.450 కోట్లు ఖర్చు చేసి సహాయ, పునరావాసం పూర్తి చేస్తే, గత ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. తాజాగా బడ్జెట్లో ఈ ప్రాజెక్టు కోసం రూ.35 కోట్లు కేటాయించామన్నారు. ఇందులో రూ.18 కోట్ల మేర పాత బకాయిలకే చెల్లించినట్లు తెలిపారు. మరో రెండేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేసి, ప్రతి ఎకరాకూ సాగునీరందిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ చైర్మన్ కింజరాపు హరివరప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు పినకాన అజయ్ కుమార్, టిడిపి నాయకులు పి.చంద్రశేఖరరావు, ఎం.మోహనరావు, ఎస్.జానకిరామ్, ఎస్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఫిబ్రవరి నాలుగో తేదీన నిర్వహించనున్న రథసప్తమి వేడుకల నిర్వహణపై ఈనెల రెండో తేదీన జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండగగా మూడు రోజుల పాటు నిర్వహించే పద్ధతిపై ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, ధార్మిక సంఘాల అభిప్రాయాలను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. కుటుంబ సమేతంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని ఎమ్మెల్యే మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులతో వేడుకల నిర్వహణ, ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, దేవాదాయశాఖ అధికారులు, ఆలయ అర్చకులు కూర్చొని ఉత్సవాలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. అరసవల్లి ఆలయ వైభవాన్ని మరింత పెంపొందించేందుకు తామంతా సమిష్టి కృషి చేస్తున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకం ద్వారా ఆలయ అభివృద్ధికి రూ.వంద కోట్లు కేటాయించేలా కేంద్ర, రాష్ట్ర మంత్రులు సమన్వయం చేస్తున్నారని తెలిపారు. ఏటా యాత్రికుల రద్దీ పెరుగుతున్నందున ఎలాంటి అసౌకర్యం కలగకుండా రథసప్తమి వేడుకలు విజయవంతం చేసే దిశగా పనిచేస్తున్నామన్నారు. ఆలయ అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ వై.భద్రాజీ, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్



సూచనలు చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అధికారులు అందుబాటులో ఉండాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

పలు సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు సూచించారు. మండలంలోని కొత్తపల్లి పంచాయతీలో గల సచివాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారుల హాజరు పట్టిక, పలు రికార్డులను పరిశీలించారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి వినతులు ఎందుకు తక్కువగా వచ్చాయని విఆర్‌ఒ వై.సత్యవతిని ప్రశ్నించారు. రైతులు వరి కోతలు, ఇతర పొలం పనుల్లో ఉండడం వల్ల తక్కువగా వచ్చాయని ఆమె వివరించారు. సర్వే నంబరు 147/2 గ్రామకంఠంగా ఉండగా, అది రిజిస్ట్రార్ కార్యాలయంలో బందగా కనిపిస్తోందని, దాన్ని సరిచేయాలని సూచించారు. పిహెచ్‌సి పరిధిలోని ఖాళీ స్థలాన్ని పరిశీలించి ఆస్పత్రికి అవసరమైన భవనాల కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మౌలిక సదుపాయాలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు.

పరిహారం ఇచ్చాకే ఎయిర్‌పోర్టు పనులు

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి - పలాస

రైతులకు పరిహారం చెల్లించాకే ఎయిర్‌పోర్టు పనులను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పలాస నియోజకవర్గంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం జరిగితే ఇక్కడి ప్రజలకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఎవరికీ నష్టం తలపెట్టకుండా ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. పలాస నియోజకవర్గ అభివృద్ధికి ఎవరూ అడ్డు పడొద్దన్నారు. మాజీ మంత్రి అప్పలరాజు, వైసిపి నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇదే ఎయిర్‌పోర్టు వైసిపి హయాంలో నిర్మించి ఉంటే తాము సంపూర్ణ సహకారం అందించేవారమని చెప్పారు. ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని అడ్డుకోవడానికి స్థానికేతరులను రప్పించి ఆందోళన చేయిస్తున్నారని ఆరోపించారు. జిల్లాకు పలాస గుండెకాయ అని, దీన్ని గుర్తించి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఇక్కడ ఎయిర్‌పోర్టును నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రతి చేనుకు నీరు, ప్రతి చేతికి పని నినాదంతో వంశధార నీరు రప్పించి ఆయకట్టు రైతులకు అందించామన్నారు. పల్లె పండగలో భాగంగా రూ.70 కోట్ల విలువైన అభివృద్ధి పనులు నియోజకవర్గంలో చేపట్టామని వివరించారు. గిరిజన ప్రాంతమైన డబారుసింగిలో రూ.మూడు కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో ఆశ్రమ పాఠశాల మంజూరు చేయడమైందన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. రైల్వే ఫ్లైఓవర్‌ను ఏడాదిలో పూర్తి చేసి, పలాస-కాశీబుగ్గ పట్టణ ప్రజలకు అంకితం చేస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శిరీష



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సెమిస్టర్ల ఫలితాలు విడుదల చేయాలి

శ్రీకాకుళం అర్బన్ : ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ పరిధిలో సెమిస్టర్ల రీవాల్యుయేషన్ ఫలితాలు తక్షణమే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.పవిత్ర, డి.చందు డిమాండ్ చేశారు. స్థానిక ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరులతో వారు మాట్లాడారు. ఆగస్టులో రెండు, నాలుగు సెమిస్టర్ల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఫలితాలు వెల్లడించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. డిగ్రీ విద్యార్థులు భవిష్యత్‌లో పిజి ప్రవేశ పరీక్షతో పాటు సెట్ పరీక్షలకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది యూనివర్సిటీలో 30 శాతం సీట్ల సంఖ్య తగ్గిందని, దీనివల్ల విద్యార్థులు పిజి చదివేందుకు ఆసక్తి పోతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 77 జిఒను అమలు చేస్తూ ప్రైవేట్ కళాశాలలో పిజి చేస్తున్న విద్యార్థులకు ఫీజులు భారం మోపారని విమర్శించారు. తక్షణమే ఈ జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సెమిస్టర్ల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేయకపోతే విద్యార్థులతో కలిసి ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.రాజు, పి.ఖగేష్ పాల్గొన్నారు.

వేతన ఒప్పందం చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మందస జీడి, రైస్‌మిల్లు కార్మికులకు వేతన ఒప్పందం వెంటనే చేయాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, నాయకులు కె.కేశవరావు, టి.లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. జీడి, రైస్ మిల్లు కార్మికుల ఛార్టర్ ఆఫ్ డిమాండ్ల పరిష్కారంలో జాప్యంపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ప్రసాదరావుకు డిసిఎల్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడి, రైస్ మిల్లు యాజమాన్యాలు కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, పిఎఫ్, ఇఎస్‌ఐ అమలు చేయడం లేదని విమర్శించారు. కార్మికులకు చట్టబద్ధమైన సౌకర్యాలు అమలు చేయకుండా తీవ్ర శ్రమ దోపిడీకి గురిచేస్తున్నాయన్నారు. రైస్‌మిల్లు కార్మికులు బస్తాలు మోసినపుడు నడుం జారినా, యంత్రాల వద్ద ప్రమాదాలకు గురైనా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. గత వేతన ఒప్పందం ముగిసి ఆరు నెలలు దాటినా నూతన వేతన ఒప్పందం చేయలేదని చెప్పారు. జీడి, రైస్‌మిల్లు యాజమాన్యాలు కార్మికులపై నిర్లక్ష్య వైఖరి వీడి చర్చలు జరిపి వెంటనే వేతన ఒప్పందం చేయాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సమ్మె తప్పదని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జీడి, రైస్‌మిల్లు కార్మికుల యూనియన్ నాయకులు జి బాలమ్మ, డి.లక్ష్మి, కె.శేషమ్మ, బి.చంద్రమ్మ, కె.కృష్ణారావు, పి.కూర్మారావు తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

తాబేళ్ల సంరక్షణ తప్పనిసరి

ప్రజాశక్తి - కవిటి

సముద్ర తాబేళ్ల సంరక్షణ తప్పనిసరిగా చేపట్టాలని అటవీశాఖ సెక్షన్ అధికారి ఆర్.రాఘవయ్య అన్నారు. మండలంలోని కె.వి పాలెం, ఇద్దివానిపాలెంలో తాబేళ్ల సంరక్షణపై మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్ సంయుక్తంగా చేపట్టిన అవగాహన కార్యక్రమంలో సముద్ర తాబేళ్ల వల్ల కలిగే లాభాలు, వేట సమయంలో వలకు చిక్కిన తాబేళ్లను ఏ విధంగా రక్షించాలి వంటి విషయాలు వివరించారు. ముఖ్యంగా సముద్ర తాబేళ్లతో పర్యావరణానికి ఎంతో మేలు చేకూరుతుందని చెప్పారు. వాటిని రక్షిస్తే సముద్రంలో జీవిస్తున్న జీవరాశులన్నింటిని రక్షించినట్టేనని తెలిపారు. కార్యక్రమంలో సముద్ర తాబేలు సంరక్షణ జిల్లా కోఆర్డినేటర్ కె.సోమేశ్వరరావు, మత్స్యకారులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

సైబర్ నేరాలు పెరిగాయి

- గతేడాదితో పోలిస్తే అదనంగా 57 శాతం కేసుల నమోదు
- ఆస్తి చోరీ, సాధారణ దొంగతనాల్లోనూ పెరుగుదల
- జిల్లాలో ఈ ఏడాది 9,434 కేసులు నమోదు
- గతేడాదితో పోలిస్తే 17 శాతం తగ్గుదల
- ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

డిజిటల్ సేవల వాడకంలో అవగాహనా రాహిత్యం, ఫిర్యాదు చేసేందుకు ప్రజలు ముందుకు రావడంతో జిల్లాలో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది సైబర్ నేరాలు (57 శాతం) పెరిగాయని ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి తెలిపారు. నగరంలోని జిల్లా పోలీసుల కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 2024 వార్షిక నేర గణాంకాలను వివరించారు. 2023లో 37 కేసులు నమోదు కాగా 2024లో 58 కేసులు నమోదయ్యాయన్నారు. జిల్లాలో సైబర్ నేరాల వల్ల మోసపోయిన ఐదుగురు బాధితులకు సంబంధించి రూ.10,13,951 కోర్టు ద్వారా తొలిసారి అందించామని వెల్లడించారు. వైట్ కాలర్ నేరాలకు సంబంధించి 2023లో 183 కేసులు నమోదు కాగా 2024లో 112 మాత్రమే నమోదయ్యాయని తెలిపారు. హత్యాయత్నం కేసులు 67 శాతం, నరహంతక కేసులు వంద శాతం, అత్యాచారం కేసులు 62.5, పోక్సో కేసులు ఎనిమిది శాతం, పెరిగాయన్నారు. రాత్రివేళ ఇళ్లలో దొంగతనాలు 13 శాతం, సాధారణ దొంగతనాలు 42 శాతం పెరిగాయని తెలిపారు. పశు అక్రమ రవాణా 2024లో అధికంగా చోటు చేసుకున్నాయని, 119 శాతం కేసులు పెరిగాయని చెప్పారు. మద్యం అక్రమ రవాణా, విక్రయాలు, సారా విక్రయాలు తదితర కేసులు 180 నుంచి 777కు పెరిగాయన్నారు. హత్యలు 36 శాతం, కిడ్నాప్ కేసులు 17 శాతం, వరకట్నం మరణాలు 33 శాతం, గృహ హింస కేసులు 14 శాతం, ఎస్‌సి, ఎస్‌టి కేసులు ఒక శాతం, ఇళ్లలో చోరీలు 19 శాతం తగ్గాయని చెప్పారు. చీటింగ్ కేసులు 31 శాతం మేర తగ్గాయని చెప్పారు. 2023తో పోలిస్తే మహిళలపై నేరాలు తగ్గాయన్నారు. 2023లో 512 కేసులు నమోదు కాగా 2024లో 462 కేసులు నమోదయ్యాని తెలిపారు. వరకట్న వేధింపులు, గృహ హింస కేసులు 2023లో 369 కేసులు నమోదు కాగా, 2024లో 312 కేసులు వచ్చాయన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు ఒక శాతం మేర తగ్గాయని చెప్పారు. 2023లో 67 కేసులు రాగా 2024లో 66 కేసులు నమోదయ్యాయని తెలిపారు.

పెరిగిన ఆస్తి చోరీ కేసులు

2023లో ఆస్తికి సంబంధించి 271 చోరీ కేసులు నమోదు కాగా, 165 కేసులను ఛేదించినట్లు తెలిపారు. చోరీ కేసులకు పాల్పడిన 170 మందిని అరెస్టు చేసి రూ.77,13,058 స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించామన్నారు. 2024లో 342 కేసులు నమోదు కాగా 229 కేసులను ఛేదించామని చెప్పారు. చోరీలకు పాల్పడిన 288 మందిని అరెస్టు చేసి రూ.2,47,34,660 స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించామన్నారు. 2023లో 19 గంజాయి కేసులు నమోదు కాగా, 66 మందిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 338.80 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. 2024లో 50 కేసులు నమోదు కాగా 96 మందిని అరెస్టు చేసి 1322.16 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

తగ్గిన రోడ్డు ప్రమాదాలు

2023లో 282 రోడ్డు ప్రమాదాలు నమోదు కాగా 297 మంది మరణించారని తెలిపారు. 2024లో 272 ప్రమాదాలు సంభవించగా 282 మంది మృత్యువాత పడ్డారన్నారు. 2023తో పోలిస్తే 2024లో నాలుగు శాతం మేర కేసులు తగ్గాయన్నారు. 2023లో అక్రమ మద్యం వ్యాపారానికి సంబంధించి 176 కేసులు నమోదు కాగా, 214 మందిని అరెస్టు చేసి 3183.775 లీటర్ల మద్యాన్ని, 37 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. 2024లో 779 కేసులు నమోదు కాగా 828 మందిని అరెస్టు చేసి, నిందితుల నుంచి 4,730.547 లీటర్ల మద్యాన్ని, 49 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. 2023లో పశువుల అక్రమ రవాణ కేసులు 57 నమోదు కాగా 132 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. 838 పశువులు , 57 వాహనాలను స్వాధీనం చేసుకుని పశువుల గోశాలకు తరలించామన్నారు. 2024లో 127 కేసులు నమోదు కాగా 243 మందిని అరెస్టు చేశామని చెప్పారు. 1845 పశువులు, 127 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

పెరిగిన మిస్సింగ్ కేసులు

2023లో 410 మిస్సింగ్ కేసులు నమోదు కాగా 338 మందిని వెతికి పట్టుకున్నట్లు తెలిపారు. తప్పిపోయిన 230 మంది మహిళల్లో 185 మందిని పట్టుకోగలిగామన్నారు. 108 మంది చిన్నారులు తప్పిపోగా 98 మందిని వారి ఇళ్లకు అప్పగించామని చెప్పారు. 2024లో 408 కేసులు నమోదు కాగా 335 మందిని వెతికి పట్టుకున్నట్లు తెలిపారు. 225 మంది మహిళలు తప్పిపోగా 193 మందిని వెతికిపట్టుకున్నామని, 98 మంది చిన్నారులు తప్పిపోగా, 92 మందిని పట్టుకున్నట్లు వివరించారు. 2024లో ఫోన్లు పోగొట్టుకున్న వారి నుంచి 1898 ఫిర్యాదులు రాగా 585 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించామన్నారు. ముందస్తు నిఘా, సమాచారణ సేకరణ, విజిబుల్ పోలీసింగ్, ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం, పలు పోలీసు విభాగాల మధ్య సమన్వయంతో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. కొత్త సంవత్సరంలో మహిళల భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, గంజాయి అక్రమ రవాణా తదితర తీవ్ర నేరాలపై ప్రత్యేక నిఘా ఉంచి శాంతిభద్రల పరిరక్షణకు కృషి చేస్తామని చెప్పారు.



సత్కారాన్ని అందుకుంటున్న పురుషోత్తంనాయుడు

పురుషోత్తంనాయుడు ఉద్యోగుల పక్షపాతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వాణిజ్య పన్నులశాఖలో గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ అధికారిగా, ఎపినాన్ గజిటెడ్, గజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిఎస్‌టి అధికారి, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చౌదరి పురుషోత్తం నాయుడు ఉద్యోగ విరమణ చేశారు. విజయవాడలోని ఎపి ఎన్‌జిఒ హోమ్‌లో మంగళవారం వీడ్కోలు సభ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆయనను గజమాలతో సత్కరించారు. ఈ సభకు రాష్ట్ర అధ్యక్షులు కె.వి.శివారెడ్డి, టిడిపి ఎమ్మెల్సీ, ఎపి ఎన్‌జిఒ సంఘం పూర్వ రాష్ట్ర అధ్యక్షులు అశోక్‌బాబు, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల ఎన్‌జిఒ నాయకులు పాల్గొని ఘనంగా వీడ్కోలు పలికారు. ఉద్యోగుల పక్షపాతిగా సుదీర్ఘ కాలం పాటు ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు, జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

సెంటర్ లైటింగ్‌పై దృష్టిసారించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో సెంటర్ లైటింగ్ ఏర్పాటుపై పాలకవర్గం దృష్టిసారించాల్సిన అవసరం ఉందని కో-ఆప్షన్ సభ్యుడు ప్రత్తి విజయకుమార్ సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం నిర్వహించారు. జీరో ఆవర్‌లో విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో చివరిలో ఉన్న మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో పరుగులు పెట్టేందుకు సెంటర్ లైటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అన్నారు. దీంతో పాటు ప్రవేశ మార్గాలు వద్ద ఇచ్ఛాపురం పేరుతో ప్రవేశం ద్వారాలు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైతే విరాళాలు సేకరణకు పట్టణంలో పుర ప్రముఖులతో చర్చించి సేకరించవచ్చునని అన్నారు. మున్సిపల్ కమిషనర్ రమేష్ సమాధానం ఇస్తూ 15వ ఆర్థిక సంఘం నిధులతో సెంటరు లైటింగ్‌కి పంపించిన ప్రతిపాదనలు ఉన్నత అధికార్లు తిరస్కరించారని అన్నారు. సుడా నిధులతో సెంటర్ లైటింగ్ ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అవుట్ సోర్సింగ్ సిబ్బంది జీతభత్యాలు చెల్లింపు విషయంలో ఎటువంటి జాప్యం చేయకుండా సకాలంలో అందేటట్లు చూడాలని వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి తెలిపారు. అంతకుముందు ఎజెండాలో ఉన్న ఏడు అంశాలు అభివృద్ధి పనులకు సంబంధించినవి కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో అధికార్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పింఛనుతో పేదలకు బాసట

ప్రజాశక్తి- కవిటి

కూటమి ప్రభుత్వం పేదలకు బాసటగా ఉంటుందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తెలిపారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన 52 వితంతు పింఛన్లను రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భర్తలను కోల్పోయిన వితంతువులు కూడా పింఛను కోసం ఏళ్ల తరబడి వేచి చూసిన పరిస్థితిని గత ప్రభుత్వం కల్పించిందని మండిపడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తిచెప్పి వారికి అండగా నిలిచేందుకు నిర్ణయించినట్టు తెలిపారు. గత ప్రభుత్వం వైఫల్యాలతో రాష్ట్రం ఆర్థికంగా కుంటుపడినా ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వం ముందుకు వెళ్తున్నట్టు అన్నారు. కార్యక్రమంలో కవిటి, ఇచ్ఛాపురం ఎంపిడిఒలు శ్రీనివాసరెడ్డి, రామారావు, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, ఎపిఎం గోవిందరావు, టిడిపి నాయకులు బెందాళం రమేష్, సీపాన వెంకటరమణ, ఆరింగి మధు, దక్కత ఢిల్లేశ్వరరావు, నరేంద్ర పాల్గొన్నారు.

పాతపట్నం : కూటమి ప్రభుత్వం ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు ఇంటింటికీ అందజేస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని కొరసవాడలో కలెక్టర స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమస్యలను పరిష్కరించాలని, పింఛన్లు మంజూరు చేయాలని చేనేత



కవిటి : పింఛన్లు పంపిణీ చేస్తున్న విప్ అశోక్

కార్మికులు కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపిడిఒ చంద్రకుమారి, మండల ప్రత్యేక అధికారి మంచు కరుణాకరరావు, మండల టిడిపి అధ్యక్షుడు పైల బాబ్జి, సర్పంచ్ జక్కర ఉమ, మడ్డు రామారావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని జాడుపల్లిలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహప్రసాద్ పండా, మాజీ ఎంపిపి సలాన మోహనరావు, టిడిపి మండల అధ్యక్షులు భాస్కర్ గౌడ, ఎంపిటిసి కదంబల సుజాత, పైడిరాజు, నంబాల వెంకటరావు, బుర్ల లలితకుమారి, అగ్గాల శ్రీనివాసరావు, చాపర మాధవరావు, రవ్వల గణపతి, బసవ పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : మండలంలోని షళంత్రిలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే కూన రవికుమార్ పంపిణీ చేశారు. అలాగే మర్రిపాడులో రూ.19 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శివ్వాల సూర్యనారాయణ అంబల్ల రాంబాబు తాడేల రాజారావు తర్లాడ సురేంద్ర, ఎంపిడిఒ ఎం.పావని, ఇఒపిఆర్‌డి బొడ్డేపల్లి రామారావు, ఎపిఎం గోవిందరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : పురపాలక సంఘం పరిధిలోని ఆరు వితంతు పింఛన్లను ఎమ్మెల్యే కూన రవికుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు నూక రాజు, నాగళ్ల మురళీధర్ యాదవ్, గుడ్ల దుర్గాప్రసాద్, తంగి గురయ్య, కూన రాము, పాతిన రమణమూర్తి, శిల్లా గురునాథరావు పాల్గొన్నారు.

పోలాకి : మండలంలోని మబగాంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.రవికుమార్, వెలుగు ఎపిఎం జి.రాజారావు, కాయ రవి, గోవిందరావు, ధర్మాన అమ్మన్నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్ : మండలంలోని కిష్టప్పపేట, సింగుపురం, మామిడివలస గ్రామాల్లో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే గొండు శంకర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బొడ్డేపల్లి శైలజ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని విశాఖ-ఎ కాలనీ, అరసవల్లి, గార మండలం రామచంద్రాపురంలో ఎమ్మెల్యే గొండు శంకర్ పింఛన్లను పంపిణీ చేశారు.

కొత్తూరు : మండలంలోని మాతలలో టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

జి.సిగడాం : మండలంలోని మధుపాంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.అప్పలనాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, నిద్దం సర్పంచ్ మీసాల రవి, బూరాడ రమణ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: మండలంలోని ఎస్.ఎం.పురంలో పింఛన్లను ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చౌదరి బాబ్జి, అధికారులు పాల్గొన్నారు.

పలాస : స్థానిక పద్మనాభ పురం కాలనీ, మండలంలోని పెదంచలలో పింఛన్లను ఎమ్మెల్యే గౌతు శిరీష పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, కుత్తుం లక్ష్మణ్‌కుమార్, లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, రవిశంకర్ గుప్తా, మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, ఎంపిడిఒ వసంతకుమార్, పంచాయతీ విస్తీర్ణాధికారి మెట్ట వైకుంఠరావు పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని బెజ్జిపురంలో ఎమ్మెల్యే ఎల్.ఈశ్వరరావు పింఛన్లను పంపిణీ చేశారు. కార్మికులు కాలువల్లో ఉన్న చెత్తను, పూడికలను తొలగించి రిక్షాలో తీసుకెళ్తున్న పనిని పరిశీలించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎంపిడిఒ పి.వెంకటరాజు, తహశీల్దార్ ఎన్ని జోగారావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పి.మధుబాబు, ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, లంక శ్యామలరావు పాల్గొన్నారు.

డీలర్ల నియామకాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- పలాస

పలాస రెవెన్యూ డివిజన్ పరిధిలో 8 మండలాలకు సంబంధించి చౌక ధరల దుకాణ డీలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రెవెన్యూ డివిజనల్ అధికారి గ్రంథి వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం చౌక ధరల దుకాణాల ఖాళీలు 15, చౌక ధరల దుకాణాల విభజన ద్వారా నిర్వహించనున్న 51 కాగా, మొత్తం 66 శాశ్వత ప్రతిపాదికన భర్తీ చేయనున్నామని అన్నారు. ఇచ్ఛాపురం కొరారి (ఎస్‌టి), బొడ్డకాళి (ఎస్‌సి), బి.తోటూరు (ఒసి-మహిళ), కంచిలి మండలంలో పద్మతుల (ఒసి), ఎం.ఎస్.పల్లి (బిసి-డి మహిళ), సువాగడ (ఎస్‌సి), కవిటి మండలంలో పెదపలియాపుట్టుగ (ఒసి-మహిళ), జల్లుపుట్టుగ (ఎస్‌సి), మందస మండలంలో మందస పట్టణంలో (ఒసి-మహిళ), (బిసి-డి), (ఒసి), వీరగ ఉన్నమ్మపురంలో (ఒసి) బాలిగాంలో (ఒసి), పొత్తంగిలో (బిసి-డి), సిద్ధిగాంలో (ఎస్‌సి)కి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. నందిగాం మండలంలో నరేంద్రపురం (బిసి-బి, మహిళ), కల్లాడలో (ఒసి-మహిళ), మొగిలిపాడు (ఒసి-ఇడబ్ల్యుఎస్), మాదిగాపురం (ఒసి -మహిళ), కొండతెంబూరులో (ఎస్‌సి), కవిటి (ఒసి-ఇడబ్ల్యుఎస్), హరిదాసుపురంలో (ఒసి), పలాస మండలంలో మాకన్నపల్లి (ఎస్‌సి), కంబిరిగాంలో (ఒసి-ఇడబ్ల్యుఎస్), పురుషోత్తపురం (ఎస్‌సి), కోసంగిపురంలో (ఒసి-ఇడబ్ల్యుఎస్), మొగిలిపాడు (ఒసి), తాళ్లభద్ర (ఎస్‌సి), సోంపేట మండలంలో బారువ-2 (ఒసి-విడో, మాజీ సైనికాధికారి), పొత్రఖండలో (బిసి-ఎ), తురకశాసనం (ఒసి), వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి-1లో (బిసి-బి), బైపల్లి-2లో (ఎస్‌సి), డోకులపాడు1లో (ఒసి), పెదబాడం (ఒసి-మహిళ, ఇడబ్ల్యుఎస్), నగరంపల్లిలో (ఎస్‌సి), ఉద్దానం గోపినాథపురం (ఒసి), కొత్తపేట (బిసి-బి-మహిళ), ఉద్దానంకూర్మనాథంపురం (ఒసి), హుకుంపేట (బిసి-సి మహిళ), మంచినీళ్లపేట (ఒసి), పల్లిపూరు-1 (ఎస్‌సి), పల్లిపూరు- 2 (ఒసి-మహిళ), రెయ్యిపాడు (బిసి-డి), కొండవూరు (బిసి-ఇ), మహాదేవపురం (ఎస్‌సి-మహిళ), నువ్వలరేవు- 2 (ఎస్‌సి), నువ్వలరేవు- 2లో (ఒసి), నువ్వలరేవు 4లో (బిసి-ఎ), వెంకటాపురంలో (ఒసి-మహిళ) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కొత్త చౌకధరల దుకాణాల్లో భాగంగా ఇచ్ఛాపురం మండలంలో పురుపోత్తపురం (పిహెచ్‌సి ఓసి), దాసన్నపేటలో (ఒసి-ఇడబ్ల్యుఎస్), మంగళవారం పేట (ఎస్‌టి), కంచిలి మండలంలో మఖరాంపురం (ఒసి-మహిళ), జాడుపూడి (బిసి-బి), కవిటి మండలంలో నెలవంక (ఒసి), బెలగాం (ఒసి-విడో, మాజీ సైనికాధికారి), సహలాలపుట్టుగ (బిసి-డి) బలియపుట్టిగలో (బిసి-డి), మందస మండలం లొహరిబందలో (ఒసి), సోంపేట మండలం పాలవలసలో (ఎస్‌సి), కర్తలిపాలెం (ఒసి-ఇడబ్ల్యుఎస్), వజ్రపుకొత్తూరు మండలం అమలపాడు (బిసి-డి), కొత్తపేటలో (బిసి-ఇ), మంచినీళ్లపేటలో (బిసి-ఎ మహిళ)కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తులను ఆర్‌డిఒ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆయా మండలాల తహశీల్దార్ కార్యాలయం నుంచి ఉచితంగా పారాలు పొందవచ్చునన్నారు. దరఖాస్తుదారుడు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణుడై, 18 నుంచి 40 ఏళ్లలోపు వయసు మించి ఉండరాదన్నారు. ఏ గ్రామ, మండలమో ఆ గ్రామ, మండలానికి చెందినవారై ఉండాలన్నారు. ఆర్థిక స్థోమత ఉన్నట్లు స్వీయ డిక్లరేషన్ అందివ్వాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 80 మార్కులకు రాతపరీక్ష ఉంటుందని, రాత పరీక్షలో 30 మార్కులు కంటే ఎక్కువ పొందిన వారు అర్హులని అన్నారు. పరీక్షలో అర్హులు అధిక మార్కులను బట్టి 15 నిష్పత్తిలో ఎంపిక చేసి 20 మార్కులకు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన వివరాలను తహశీల్దార్లకు పంపించి అధిక మార్కుల వారికి నియామకాలు 15 నిష్పత్తిలో ఎంపిక చేసి 20 మార్కులకు నిర్వహిస్తామన్నారు. దరఖాస్తుల స్క్రూట్నీ 22న నిర్వహిస్తామన్నారు. హాల్ టిక్కెట్ పంపిణీ 27న చేపడతామన్నారు. ఫిబ్రవరి 5న రాతపరీక్ష పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉంటుందన్నారు. ఫలితాల ఫిబ్రవరి 10, మౌఖిక పరీక్ష ఫిబ్రవరి 15న నిర్వహించి తుది ఫలితాల ప్రకటన ఫిబ్రవరి 18న ఉంటుందన్నారు. నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పైపులు వేస్తున్న పంచాయతీ సిబ్బంది

పైపులైన్‌కు మరమ్మతులు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

లావేరు: మండల కేంద్రం లావేరు పెద్దవీధిలో తాగునీటి పైపులైన్‌కి లీకులు కావడంతో రెండు నెలలుగా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ఈ సమస్యపై డిసెంబరు 30న 'ప్రజాశక్తి'లో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించి మంగళవారం తాగునీరు పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. ఈ పనులను కార్యదర్శి దాలినాయుడు దగ్గర ఉండి పరిశీలించారు. పైపు లీకులు వద్ద తవ్వించి విరిగిపోయిన పైపును తీసి కొత్త పైపు వేసి లీకులు లేకుండా చేశారు. తాగునీరు సక్రమంగా వెళ్లే విధంగా ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. దీంతో గ్రామస్తులు రెండు నెలలుగా సమస్య పరిష్కారం కాక ఇబ్బందులు పడ్డామని, 'ప్రజాశక్తి' చొరవతో అధికారులు పరిష్కరించారని సంతోషం వ్యక్తం చేశారు. గ్రామస్తులు ఇనుమూర్తి కిశోర్‌కుమార్, వెంకటరావు, గోరు సత్యారావు తదితరులు ప్రజాశక్తికి కృతజ్ఞతలు తెలిపారు.



నిర్మించిన గ్రావెల్ రోడ్డు

గుమ్మడాంలో రోడ్డు నిర్మాణం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

లావేరు: మండలంలోని గుమ్మడాంలో ఆంజనేయ స్వామి ఆలయం నుంచి బొంతుపేట రావాడ రోడ్డుకి చేరుకొనే రహదారి నిర్మాణం పనులు అధికారులు మంగళవారం చేపట్టారు గుమ్మడాంలో రహ'దారుణా'లు అనే శీర్షికతో డిసెంబరు 4న 'ప్రజాశక్తి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై పంచాయతీ అధికారులు, పాలకులు స్పందించారు.కార్యదర్శి కెళ్ల రామకృష్ణ, సర్పంచ్ ప్రతినిధి దుర్గాసి ధర్మారావు, నాగం కనకారాజు తదితరులు ట్రాక్టర్లతో కొండ గ్రావెల్ తెప్పించి రహదారి నిర్మాణం పనులుచేపట్టి గ్రామంలో బురద ఇబ్బందులు లేకుండా చేశారు. దీంతో గ్రామస్తులు బురద బాధలు తిరిపోవడంతో సంతోషం వ్యక్తం చేశారు.

బియ్యం గింజంత పరిమాణంలో
2025 బంగారు లోగో



పలాస : కాశీబుగ్గ గాంధీ నగర్‌కు చెందిన సూక్ష్మ శిల్పి, స్వర్ణరత్న బ్రహ్మర్షి కొత్తపల్లి రమేష్ ఆచారి బియ్యం గింజంత సైజులో వెల్కమ్ 2025 లోగో ఈ నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ 2025 బంగారపు లోగో చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ లోగో తయారు చేయడానికి సుమారు ఐదు గంటల సమయం పట్టినట్లుగా తెలియజేశారు. పలుచటి రేకుపైన కేవలం 0.30 మిల్లీ గ్రాముల బంగారాన్ని ఉపయోగించి తయారు చేశారు. దీని ఎత్తు కేవలం అర సెంటి మీటరు వెడల్పు, అర సెంటీమీటర్ అని తెలిపారు.

ప్రజాశక్తి కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కామినాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నూతన సంవత్సరానికి ఆహ్వానిస్తూ ప్రజాశక్తి కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఎచ్చెర్ల మండలం నవభారత్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో మంగళవారం నిర్వహించిన సంబరాల్లో భాగంగా ప్రజాశక్తి శ్రీకాకుళం ఎడిషన్ మేనేజర్ పి.కామినాయుడు కేకును కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేసే పనిలో బలహీనతలను అధిగమించి ముందుకు సాగలన్నారు. కొత్త సంవత్సరంలో సానుకూల దృక్పథంతో పనిచేసి వ్యక్తిగత అభివృద్ధితో పాటు సంస్థ ప్రగతికి దోహదపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు ఎ.సోమశేఖరరావు, జి.లక్ష్మణరావు, టి.భీమారావు, టి.బుజ్జిబాబు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫ్యాషన్ షో

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని పిఎన్ కాలనీలో ఉన్న జాయ్ కిడ్స్ స్కూల్ చిన్నారుల మంగళవారం నిర్వహించిన ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. నగరానికి చెందిన వైద్యులు విజయ్‌కుమార్, హర్షవల్లి పాల్గొని మాట్లాడారు. చిన్నారుల్లో ఆలోచనలు, సృజనాత్మకత పెంపొందించేందుకు వినూత్నమైన ఆలోచనలతో విద్యాబోధన చేస్తున్న జాయ్‌కిడ్స్ యాజమాన్యాన్ని అభినందించారు. చిన్నారులకు తరగతి గదుల్లో బంధించేలా ఉండకుండా ఆటపాటల నడుమ పాఠాలు చేర్చుకునేలా మంచి వాతావరణం కల్పించడం ప్రశంసనీయమన్నారు. జపాన్, చైనా వంటి దేశాల్లో ఇటువంటి విద్యనే చిన్నారులకు అందిస్తున్నారని అన్నారు. ఆ తరహా విద్యాబోధన వల్ల చిన్నారుల్లో జ్ఞాపకశక్తి



ఫ్యాషన్ షో నిర్వహిస్తున్న చిన్నారులు

మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జామి స్రవంతి నూతన సంవత్సరం వేడుకలను పర్యవేక్షించారు. చిన్నారుల్లో కేకులు, గిఫ్టలు, రంగులే కొత్త సంవత్సర వేడుకలు కాకూడదన్నారు. పూలతో చిన్నారులను అలంకరించి నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ ఫ్యాషన్ షో ఏర్పాటు చేశామన్నారు. ఈ పోటీల్లో న్యాయ నిర్ణేతలుగా వైద్యులు వ్యవహరించారు. ఈ పోటీల్లో టియాన్స్, ఇసాన్విలు ప్రథమ స్థానంలో నిలిచారు.



మాట్లాడుతున్న రామకృష్ణ

ఆర్ట్స్ సంస్థ సేవలు అమోఘం


ప్రజాశక్తి- బూర్జ

ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ సేవలు అమోఘమని మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ అన్నారు. మండలంలోని పెద్దపేట ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థలో మంగళవారం నిర్వహించిన వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ఆర్ట్స్ డైరెక్టర్ నూక సన్యాసిరావు ఈ ప్రాంత రైతులకు, మారుమూల అటవీ ప్రాంతంలో నివాసం ఉంటున్న గిరిజనులకు చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. ప్రకృతి వైపరీత్యాలు కారణంగా నష్టపోయిన వారిని ఆదుకోవడంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. అవగాహన లేని రైతులకు అనేక శిక్షణలు అందించి అధిక ఆదాయాన్ని పొందేవిధంగా తీర్చిదిద్దారన్నారు. ఈ సంస్థ వల్ల అనేక మంది నిరుద్యోగులు ఉపాధి పొందుతున్నారని అన్నారు. గిరిజన రైతులు పండించిన పంటలకు, చిరుధాన్యాల కొనుగోలుకు ప్రోత్సహిస్తున్నారని అన్నారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా తనవంతు సంపూర్ణ సహకారాన్ని అందిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం రామకృష్ణకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ డైరెక్టర్ నూక సన్యాసిరావు, మండల ఎఒ శ్రీనివాసరావు, ఎంఇఒ శ్యాంసుందర్, ఆర్ట్స్ ప్రతినిధి బి.శంకరరావు, సిఇఒలు పాల్గొన్నారు.

ధాన్యం బస్తాలు చోరీ

ప్రజాశక్తి- బూర్జ

విక్రయించడానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం బస్తాలు చోరీకి గురయ్యాయని మండలంలోని మరువాడకు చెందిన రైతు గేదెల జోగినాయుడు తెలిపారు. మండలంలోని కొమ్మువలసలో వ్యవసాయం చేస్తునని అన్నారు. ఆదివారం సంపద రకం దాన్యం బస్తాలు 53, సాంబమసూరి 12 బస్తాలు నరేంద్రపురం వద్ద రోడ్డు పక్కన విక్రయించేందుకు ఉంచినట్లు తెలిపారు. ఆది, సోమవారాలు రాత్రి పది గంటలకు వరకు ఉన్నాయని అన్నారు. మంగళవారం ఉదయం విక్రయించేందుకు వ్యాన్



వివరిస్తున్న రైతు జోగినాయుడు

తీసుకొని రాగా, సంపద రకం బస్తాలు 22, సాంబమసూరి ధాన్యం బస్తాలు ఆరు చోరీకి గురైనట్లు గుర్తించాలని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు దొంగించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశానని అన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎసి రమణి

దేవాదాయ భూముల రక్షణకు చర్యలు

దేవాదాయశాఖ ఎసి వై.వి రమణి

ప్రజాశక్తి- పొందూరు

ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని జిల్లాలో దేవాదాయశాఖ పరిధిలో ఉన్న 13 వేల ఎకరాల భూములను పరిరక్షించుకునేందుకు పటిష్టచర్యలు తీసుకుంటున్నామని జిల్లా దేవాదాయ, ధర్మాదాయశాఖ ఇన్‌ఛార్జి అసిస్టెంట్ కమిషనర్ వై.వి.రమణి అన్నారు. మండలంలోని కంచికామాక్షి ఆలయానికి సంబంధించి పలు అంశాలపై కమిటీ సభ్యులు జి.రాజాచార్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం విచారణ చేపట్టారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దేవాదాయశాఖకు సంబంధించి 40 రిజిస్టరు, 22-ఎ రిజిస్టర్ల ఆధారంగా 13 వేల ఎకరాల మాన్యం ఉందని అన్నారు. కానీ, 4 వేలు ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తించామని, వీటన్నిటినీ తిరిగి తాము స్వాదీనం చేసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆక్రమణకు గురైన దేవాదాయ భూముల్లో నిర్మాణాలు చేపట్టిన వారికి, భూములు విక్రయించన వారిపై చట్టరీత్యా న్యాయపరమైన చర్యలు తప్పవన్నారు. జిల్లాలో 130 దేవాలయాలకు దూప దీప నైవేద్యం పథకం కింద రూ.10 వేలు అందిస్తున్నామని తెలిపారు. విశ్వబ్రాహ్మణ సంఘం అంతర్గత విభేదాలకు కంచికామాక్షి ఆలయ ప్రతిష్టతను కాపాడాలని సర్పంచ్ ఆర్.లక్ష్మి, మాజీ సర్పంచ్ అనకాపల్లి విజయలక్ష్మి కోరారు. విచారణలో ఆలయ చైర్మన్ ధనుంజయరావు, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కె.సూర్యనారాయణ పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

నరసన్నపేట : ఈనెల 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడలో నిర్వహించనున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలకు ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి పిలుపునిచ్చారు. ఎంఇఒ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ మండల అధ్యక్షులు టి.సుధీర్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం యుటిఎఫ్ కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యుటిఎఫ్ స్థాపించి 50 ఏళ్లలో ఎన్నో పోరాటాలు, ఉపాధ్యాయుల ప్రయోజనాల కోసం పనిచేసిందన్నారు. కార్యరకమంలో జిల్లా గౌరవాధ్యక్షులు కోరాడ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీరామ్మూర్తి

వైకుంఠరావు, ప్రధాన కార్యదర్శి కె.ఆదినారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.దమయంతి, ఎ.ఆర్.భూషణరావు, పి.కృష్ణారావు, పి.తిరుమలరావు, పి.వేణుగోపాలరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గిరిధర్ పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న బిసి సంఘం నేతలు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో రైతులు ఆరుగాలం పండించిన ధాన్యం కొనుగోలు సమయంలో మిల్లర్లు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, 10 కిలోలు తక్కువగా తూకం వేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని జిల్లా బిసి సంక్షేమ సంఘం నాయకులు బీన ఢిల్లీరావు, చౌదరి లక్ష్మణరావు, అమిరుల్లా బేగ్ లు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లోని జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, కొన్నిచోట్ల ఇప్పటికే కళ్లాల్లోనే ధాన్యం ఉన్నాయని వివరించారు. కోత యంత్రాల ద్వారా నూర్పు చేసిన ధాన్యంలో తేమ శాతాన్ని ఎక్కువగా చూపించి రైతులను మిల్లర్లు ఇబ్బందుల పాల్జేస్తున్నారన్నారు. కొందరు మిల్లర్లు అధిక తూకం వేసి 10 కిలోలు అదనంగా ఇస్తే తప్ప తీసుకోవడం లేదని వివరించారు. రైతులు అడిగితే మిల్లు వద్ద నుంచి దాన్యం తిప్పి పంపుతున్నారన్నారు. దీనివల్ల దళారులను ఆశ్రయించాల్సి వస్తోందని వారు అన్నారు. ప్రధానంగా పలాస డివిజన్‌లో రైతాంగ సమస్యను పరిష్కరించి మిల్లర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

కల్వర్టు నిర్మించాలని వినతి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సాగునీటి కాలువపై కల్వర్టు నిర్మాణం చేపట్టాలని వంశధార నీటి డిస్ట్రిబ్యూషన్ మండల కమిటీ అధ్యక్షులు గొణప నిరంజన్ కోరారు. ఈ మేరకు పలాసలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గౌతు శిరీషను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంపల్లి నీటి వినియోగదారుల సంఘం పెద్దబదాం ఆయకట్టులో భాగంగా కందిబంద చెరువుకు వంశధార సాగునీరు వచ్చే కాలువపై 50 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన ఇటీవల కూలిపోయిందని వివరించారు. పొలాలకు వెళ్లే రైతులకు రహదారిగా ఉపయోగపడే వంతెన కూలిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులను దృష్టిలో ఉంచుకొని తక్షణమే వంతెన పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కణితి సురేష్, నగరంపల్లి నీటి సంఘం అధ్యక్షులు దువ్వాడ అప్పారావు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నిరంజన్



పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు

ఎచ్చెర్ల : ఎచ్చెర్ల ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు మైదానంలో కానిస్టేబుళ్ల ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు రెండో రోజు దేహదారుఢ్య పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. మంగళవారం 605 మంది అభ్యర్థులకు గాను, 409 మంది పాల్గొన్నారు. ఇందులో 205 మంది అభ్యర్థులు క్వాలిఫైడ్ అయ్యారు. ప్రణాళికాబద్ధంగా ధ్రువపత్రాలను పరిశీలించిన తర్వాత ఎత్తు, ఛాతీ వంటి ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లు 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు యథావిధిగా నిర్వహించారు.

జ్ఞానతేజకు అభినందనలు

టెక్కలి : మండలంలోని సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అన్నెపు జ్ఞానతేజ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని 4వ ర్యాంకు సాధించారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తారు వేణికుమారి, సిబ్బంది అభినందించారు. భారతీయ విజ్ఞాన మండలి ఆధ్వర్యాన నిర్వహించిన పోస్టర్ పోటీల్లో పాల్గొన్న జ్ఞానతేజ తన ప్రతిభ కనబర్చారు. జ్ఞానతేజకు ఉపాధ్యాయులు నరేష్, లక్ష్మణరాజా, రమాదేవి, వాసు, గౌరీపతి అభినందించారు.



సన్మానిస్తున్న వ్యాపారులు

సరుగుడు, నీలగిరి వ్యాపారుల సంఘం
జిల్లా అధ్యక్షునిగా గురుమూర్తిరెడ్డి

లావేరు: సరుగుడు, నీలగిరి కర్రలు వ్యాపారుల సంఘం జిల్లా అధ్యక్షునిగా బశ్వా గురుమూర్తిరెడ్డి ఎన్నికయ్యారు. మండలంలోని బుడుమూరులో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా భాగత రాంబాబు, కోశాధికారిగా పెద్దకొత్తపల్లి సర్పంచ్ ఆరేళ్ల కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా బి.పూర్ణచంద్రరావు, సన్యాసిరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడికి దుశ్శాలువ కప్పి సన్మానించి అభినందించారు.

అమిత్ షా దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి- పర్లాకిమిడి

గజపతి జిల్లా గుసాని సమితి గారబంధలో అంబేద్కర్ వీకర్ సెక్షన్ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అమిత్ షా అనుచిత వ్యాఖ్యలకు నిరసంగా అమిత్ షా దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. తక్షణమే హోంమంత్రి పదవికి రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. ముందుగా గారబంధ ప్రభుత్వాస్పత్రి నుంచి మహేంద్రం కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంబేద్కర్ వీకర్ సెక్షన్ సంక్షేమ సంఘం కార్యదర్శి కింజరాపు బాలకృష్ణ, సభ్యులు పాలక త్రినాథ్, ఇస్మాయిల్ సబర్, నర్సింగరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి ముచ్చి బంగారయ్య, దొండపాణి రైతో, బల్ల చలపతిరావు, పైల మురళి పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



టెక్కలి : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మన్మోహన్‌సింగ్‌కు నివాళి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాప దినాల్లో భాగంగా నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి మంగళవారం పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అపర చాణిక్యుడు, ఆర్థిక మేధావి మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటని అన్నారు. భారతీయ ఆర్థిక వ్యవస్థకు ఊపిరి పోసిన గొప్ప ఆర్థికవేత్త అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లఖినేని నారాయణరావు, సువ్వారి రమణ, సనపల వాసుదేవరావు, పప్పల అప్పారావు, పూజారి త్రినాథరావు, శ్రీను, రామారావు పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక ఇందిరానగర్ కూడలి వద్ద మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా పార్లమెంటరీ నాయకులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ అధ్యక్షులు కోత మధుసూదనరావు, మండల కాంగ్రెస్ నాయకులు పొట్నూరు ఆనందరావు, కోటబొమ్మాళి మండలశాఖ అధ్యక్షులు దాట్ల లింగమూర్తి, బాలగంగాదర్ గుప్త, పేడాడ సూర్యనారాయణ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదులు విధుల బహిష్కరణ

ప్రజాశక్తి- పలాస

న్యాయవాది మృతికి పోలీసుల తీరే కారణమని భావించి పలాస కోర్టులో మంగళవారం న్యాయవాదులు విధులను పరిష్కరించారు. గాలివీడులో సీనియర్ న్యాయవాది సుదర్శన్‌రెడ్డిని సిఐ చొక్కా పట్టుకొని ఈడ్చికెళ్లడం, అనంతపురం త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్లో అక్కడి సిఐ, ఇతర అధికారులు సివిల్ వివాదంలో న్యాయవాది శేషాద్రిపై అప్రజాస్వామియకంగా ప్రవర్తించడంతో గుండెపోటుతో మృతి చెందారని అన్నారు. ఆయన మృతిపై పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఫయాడ్ అహ్మద్, సెక్రటరీ పిండి వెంకటరావు, జాయింట్ సెక్రటరీ జిఎంఎస్ అనిల్‌రాజు, ట్రజరర్ రవి, సీనియర్ న్యాయవాదులు పి.ఎల్.నారాయణ, తాండ్ర మురళి, ఎల్.చంద్రశేఖర్, కొమర దేవరాజు, కె.శ్రీనివాస్, లోకేష్, కృష్ణారావు, ఎల్. వెంకటరావు పాల్గొన్నారు.



టిడిపిలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంకర్

టిడిపిలో పలువురు చేరిక

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టడంలో నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి పనిచేస్తామని గార మండలం రామచంద్రాపురానికి చెందిన పలువురు వైసిపి కార్యకర్తలు ప్రకటించారు. మంగళవారం విశాఖ-ఎ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన సమక్షంలో వారంతా టిడిపిలో చేరారు. వారిని టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపిలో చేరిన వారిలో జక్క అప్పలనాయుడు, జక్క రామారావు, జక్క బాలు, మర్రి మల్లేష్, ధర్మవరపు చిరంజీవి, కెల్ల ఈశ్వరరావులు ఉన్నారు. అంబటి శంకర్, కుంచాల సురేష్, సాధు మల్లికార్జునరావు, సాధు జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

45 రోజుల్లో రెవెన్యూ సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి- పలాస

ఫిర్యాదు చేసిన 45 రోజుల్లో రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పెంటిభద్ర, పద్మనాభపురం కాలనీలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏమైనా భూ సమస్యలు ఉంటే రైతులు సదస్సుల్లో ఫిర్యాదు చేసుకుంటే తప్పకుండా న్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, సవర రాంబాబు, కొండే నర్సింహులు, తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, రీ సర్వే డిటి వాయిలపల్లి సునంద, మండల సర్వయర్ గిరి, ఆర్ఐ కంచరాన ఖగేశ్వరరావు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని బురిడికంచరాంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొని మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో వ్యవస్థలను ధ్వంస చేయడంతో సంక్షేమపథకాల అమలుకు విఘాతం కలుగుతోందని చెప్పారు. రెవెన్యూ సదస్సులు నిర్వహణ ద్వారా పేరుకుపోయిన భూసమస్యలకు పరిష్కారమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేష్, రామానుజులు, జనసేన జిల్లా అధ్యక్షులు పి.చంద్రమోహన్, టిడిపి మండల అధ్యక్షులు రామ్మోహన్, ఉపాధ్యక్షులు, వండాన మురళి, బలగ శంకరబాస్కర్ పాల్గొన్నారు.



పలాస : మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

కోటబొమ్మాళి: అధికారులు గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు రైతులకు వరం లాంటివని, భూముల నమోదుతో తప్పులు ఉంటే ఈ వేదిక ద్వారా సరిచేసుకోవాలని కోటబొమ్మాళి సర్పంచ్ కాళ్ల సంజీవరావు అన్నారు. మండలంలోని కోటబొమ్మాళి సచివాలయం పరిధిలో రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో డిటి సిహెచ్.వి.ఎస్.కె. ప్రసాదరావు, రీ సర్వే డిటి పి.శ్రీనివాస్, మండల సర్వేయర్ పి.వి.ఎస్.ఆర్. మూర్తి, ఆర్ఐ డి.పవిత్ర, విఆర్ఒ రంగస్వామి పాల్గొన్నారు.

లావేరు : భూ సమస్యలు పరిష్కరమే ధ్యేయంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఎన్ని జోగారావు అన్నారు. మండలంలోని తాళ్లవలస, సిర్లపాలెం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 20 వినతిపత్రాలు వచ్చినట్లు తెలిపారు. సమావేశంలో మండల సర్వేయర్ బి.శ్రీధర్‌రెడ్డి, డిటి ఎం.తిరుపతిరావు, ఆర్ఐ రాపర్తి అప్పలరాజు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎఒ గోవిందరావు

అపరాల పంటలు పరిశీలన

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రబీ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న వేరుశనగకు ఎకరాకు 4 బస్తాల జిప్సం వేసి గొప్పు చేయాలని మండల వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు అన్నారు. మండలంలోని చిట్టేవలస పంచాయతీ పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సిబ్బంది రైతులతో కలిసి వేరుశనగ, పెసర, మినప సాగులను పరిశీలించారు. మినుము పంటలో 13-0-45 ఒక కేజీ ఒక ఎకరాకు స్ప్రే చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో విఎఎ టి. శ్రావణి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

కోటబొమ్మాళి: మండలంలో పలు కుటుంబాలను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మంగళవారం పరామర్శించారు. మండలంలోని రామేశ్వరంలో ఎంపిటిసి పంకు రాము అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయనకు పరామర్శించారు. కొత్తపల్లికి చెందిన గోపాల్‌రావు కుమారుడుకు ప్రమాదంలో గాయపడడంతో వారి కుటుంబ సభ్యులకు పరామర్శించారు. సరియాపల్లి సర్పంచ్ పిట్ట శ్రీనును పరామర్శించారు. కార్యక్రమంలో రామేశ్వరం సర్పంచ్ మహేష్, సింహాచలం, ముత్యాలు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ సేవలు ప్రశంసనీయం

శ్రీకాకుళం అర్బన్ : వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు పరిసరాల పరిశుభ్రత సామాజిక సేవా రంగాల్లో నిరంతరం వాకర్స్ సంస్థలు చేస్తున్న కృషి ప్రశంసనీయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో 33వ వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో బహుమతులు అందుకున్న వాకర్స్ సంస్థల అభినందన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఉత్తమ క్లబ్‌గా ఎంపికైన స్టార్ వనిత వాకర్స్‌లో అధ్యక్షులు జి.లక్ష్మిని అభినందించారు. ఆర్ట్స్ కళాశాల అభివృద్ధిలో స్టార్ వాకర్స్ సభ్యుల సహకారం మరువలేనిదన్నారు. జనవరి 23, 24 తేదీల్లో కళాశాలకు నాక్ బృందం సందర్శించనున్న నేపథ్యంలో వాకర్స్ సభ్యులు మరింత సహకారాన్ని అందించాలని కోరారు. వాకర్స్ మాజీ గవర్నర్లు జి.ఇంద్రప్రసాద్, పి.జి.గుప్తా, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు శాసపు జోగినాయుడు పాల్గొన్నారు.

ఎటిఎం మోడల్ సాగుతో నిరంతర ఆదాయం



విత్తనాలను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎటిఎం మోడల్ కూరగాయల సాగుతో రైతుకు నిరంతర ఆదాయం చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయ డిజిటల్ ఎల్ టు చేపేన సురేష్ అన్నారు. మండలంలోని నిమ్మతోర్లాడ, కొత్తవలస గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి ఆధ్వర్యాన ఎటిఎం మోడల్ పద్ధతిలో కూరగాయల విత్తనాలను పొలాల్లో మంగళవారం వేయించారు. రైతుకు నిత్యం ఆదాయం వచ్చేలా నమూనా పద్ధతిలో పలురకాల కాయగూరలు పంటలు సాగు చేసుకున్నట్లయితే రూ.25 వేలు వరకు ఆదాయం వస్తుందన్నారు. నమూనా పద్ధతి చేయడానికి 20 సెంట్లు స్థలం ఉంటే సరిపోతుందని తెలిపారు. అలాగే రైతులు అదనపు ఆదాయం వచ్చేలా క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో రైతులు పలు పంటలు సాగు చేసుకోవడంతో దిగుబడి, ఆదాయం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పిలు తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణి, జానకిరామ్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

ప్రభుత్వ విప్ అశోక్

ప్రజాశక్తి- కవిటి

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని ఎర్రగోవిందపుట్టుగలో రూ.9 లక్షలతో నిర్మించిన సిసి రహదారులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం రహదారుల నిర్మాణంతో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో దయనీయంగా మారాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తిస్థాయిలో పక్కా రహదారుల నిర్మిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్, జనసేన ఇన్చార్జ్ దాసరి రాజును గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బెందాళం రమేష్, బాసుదేవ్ రౌలో, బీమా రౌలో, సంతోష్ పట్నాయక్, ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, మురళీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డును ప్రారంభిస్తున్న విప్ అశోక్



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రైతన్నకు పలకరింపు

ప్రజాశక్తి- జి.సిగడాం

మండలంలోని మధుపాం పొలంలో ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించడానికి రైలు కూలీలు మంగళవారం మూటలు కడుతున్నారు. నియోజకవర్గం పర్యటనకు వెళ్తున్న సమయంలో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు రైతులను పలకరించారు. అనంతరం ధాన్యాన్ని పరిశీలించారు. తుపాను కారణంగా ఏమైనా నష్టం వాటిల్లిందా? అని రైతులను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం మద్దతు ధర పెంచడంపై రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ అధికారుల నుంచి సరైన సమాచారం వస్తుందా? అని అడిగారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

రణస్థలం రూరల్ : మండలంలని కమ్మసిగడాం - దేవరాపల్లి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వి.జె.ఎస్.ఎల్.పి.మౌళి, వేల్పురాయి సర్పంచ్ బాలి శ్రీను, పిసిని జగన్నాథంనాయుడు, పిన్నింటి భానోజీనాయుడు, మన్నె లక్ష్మీప్రసాద్, వెలిచేటి రామకృష్ణ, బాలి రామునాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దానేష్

కార్గో ఎయిర్‌పోర్టు వద్దు

ప్రజాశక్తి- మందస

కార్గో ఎయిర్ పోర్టు నిర్మించవద్దని, ఉద్దానం ప్రాంతంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని వక్తలు కోరారు. మండలంలోని హరిపురం మార్పు ట్రస్టు గ్రంథాలయంలో పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్తిరి దానేష్ అధ్యక్షతన పౌర హక్కుల సంఘం, దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం ప్రగతి శీల కార్మిక సంఘం, డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్, అమరుల బంధుమిత్రుల సంఘం, రైతాంగం సంఘాలు, ప్రజాస్వానిక వాదులతో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు కావాలని రైతుల నిరసనలను ప్రభుత్వం పరిగణలో తీసుకోవాలన్నారు. కొద్దిమంది ప్రయోజనాలకే రైతుల భూముల అప్పజెప్పడం సరికాదన్నారు. కార్యక్రమంలో టీచర్స్ డెమొక్రటిక్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు కోత ధర్మారావు, వీరాస్వామి, పచ్చ దుర్యోధన, జోగి కోదండరావు త్రిలోచనా, కోనేరు రమేష్, రామారావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఈశ్వరరావు

రోడ్ల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కూటమి ప్రభుత్వంతోనే రోడ్ల అభివృద్ధి సాధ్యమని అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు అన్నారు. పూండి బస్టాండ్ నుంచి గోవిందపురం జూనియర్ కళాశాల వరకు రూ.15 లక్షలతో నిర్మిస్తున్న తారు రోడ్డు పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో రోడ్లు దారుణంగా తయారయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించారని తెలిపారు. నిధులు మంజూరుకు కృషి చేసిన వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీషకు అభినందనలు తెలిపారు. ఈయనతో ఆపటు టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, తుంబనాథం ఉన్నారు.

పవన్‌ని విమర్శించే హక్కు లేదు

ప్రజాశక్తి- బూర్జ

జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను విమర్శించే హక్కు మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు లేదని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్ల జయరాం అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ తమ్మినేని కుమారుడిని పరామర్శకు వచ్చిన సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నకు ఏం సమాధానం చెప్పాలో తెలియక సీతారాం ఇలాంటి విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. పవన్ కళ్యాణ్‌ను జనసేన పార్టీని తక్కువ చేసి మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న రమణ

గిరిజన యువతకు శిక్షణ

ప్రజాశక్తి- పాతపట్నం

గిరిజన గ్రామాల్లో అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకు యువత కృషి చేయాలని బ్రేడ్స్ ఎపిఎఫ్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జె.వి.రమణ అన్నారు. బ్రేడ్స్ ఆధ్వర్యాన అజీమ్ ప్రేమాజీ ఫౌండేషన్ సహాయంతో ప్రభుత్వ పథకాలు, అవసరమైన ధ్రువపత్రాలపై గిరిజన యువతకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. అరుకు నేచర్ సంస్థ రిసోర్స్‌పర్సన్లు వికాస్, ప్రసాద్, ఐటిడిఎ పిఎంయు నుంచి కళ్యాణ్‌జూమ్, లోకేష్‌లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో బ్రేడ్స్ ప్రెసిడెంట్ సంబమూర్తి, ప్రాజెక్టు డైరెక్టర్ కోదండపాణి పాల్గొన్నారు.

దోమలతో అవస్థలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేక దోమలు బెడద అధికంగా ఉందని, ప్రజలు దోమల వల్ల అనారోగ్యం బారిన పడుతున్నారని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ప్రతినిధులు కోరారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. తాగునీటి సరఫరాలో సమయపాలన లేదని, తాగునీటి పరిశుభ్రత కొరవడుతోందని వివరించారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు జె.శ్రీనివాసరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు రద్దు చేయాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని కొలిగాంలో మండలో ఇంటి పేరు ఒసిలు 160 కుటుంబాలు వరకు జీవనం సాగిస్తున్నారని, ఇటీవల జనన నమోదులో ఎస్‌సిలుగా నమోదు చేసుకున్నారని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ సొసైటీ నియోజకవర్గ అధ్యక్షులు సెల్లా దేవరాజు అన్నారు. ఈ మేరకు తహశీల్దార్ వెంకటరావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజేంద్ర మండలో, ప్రకాశ్ చంద్ర నాయక్, కృష్ణా మండలో తరగతి ధ్రువపత్రాలు రద్దు చేస్తూ... అప్పటి కలెక్టర్ ధనుంజయరెడ్డి ప్రొసీడింగ్ ఇచ్చారని చెప్పారు. మండలో ఇంటి పేరుతో ఎస్‌సిలుగా లబ్ధిపొందుతున్న వీరికి తరగతి ధ్రువపత్రాలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో కవిటి మండల అధ్యక్షులు మద్దిల కేశవరావు, పట్టణ అధ్యక్షుడు గువ్వాడ దిలీప్, దండంగి శ్రీను, బాగా తులసి పాల్గొన్నారు.

విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యులకు సన్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అణగారిన తరగతులపై వివక్ష లేకుండా ఎస్‌సి విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు కృషి చేయాలని దళిత సంఘాల నాయకులు పోతల దుర్గారావు, అంపోలు ప్రతాప్, గంజి ఎజ్రా లు కోరారు. నగరంలోని పాత శ్రీకాకుళంలో మంగళవారం ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులుగా నియమితులైన కళింగపట్నం అప్పన్న, దండాశి రాంబాబు (జాన్), దాసరి తిరుమలరావులను మంగళవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేం దుకు విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యులకు చక్కటి వేదిక అని, ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సత్కరిస్తున్న దళిత సంఘాల నాయకులు

గౌరవ వేతనం ఇప్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న విఒఎలు

ఇచ్ఛాపురం: గ్రామ సంఘాలకు ప్రాజెక్టు నుంచి రావాల్సిన గౌరవ వేతనాలు అందడం లేదని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమ సమస్య పరిష్కరించాలని విఒఎలు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. విఒఎలకు ప్రాజెక్టు నుంచి రూ.800 గౌరవ వేతనం అందుతుందని అన్నారు. అలాగే గ్రామ సంఘం ద్వారా వచ్చిన ఆదాయం నుంచి రూ.2 వేలు, మొత్తం రూ.పది వేలు గౌరవ వేతనం చెల్లించేవారని అన్నారు. కానీ, 2019 తర్వాత రిజిస్టర్ అయిన గ్రామ సంఘాలకు ప్రాజెక్టు నుంచి రావాల్సిన గౌరవ వేతనం ఇప్పటికీ మంజూరు కాలేదని వివరించారు. కార్యక్రమంలో విఒఎలు లత, ఈశ్వరి, కళ్యాణి, నీలవేణి, త్రివేణి, సబితా బెహరా, లక్ష్మి పాల్గొన్నారు.

కేలండర్ల ఆవిష్కరణ

కవిటి: కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ 2025లో విద్యారంగం మరింత అభివృద్ధిలోకి సాగాలని ఎంఇఒ ధనుంజయ మజ్జి అన్నారు. స్థానిక ఎంఆర్‌సిలో మంగళవారం ఎపిటిఎఫ్ 1938 కేలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు బి.ధర్మారావు, కార్యదర్శి జి.వంశీ, గౌరవాధ్యక్షుడు బి.రంగారావు, స్టేట్ ఆడిట్ కమిటీ సభ్యులు మొర్రి గోపి, పండి కృష్ణారావు, శ్రీరామ్మూర్తి బిసాయి, భార్గవ్, ప్రకాష్, వెంకటరమణ, కృష్ణచంద్రపాడి పాల్గొన్నారు.

రణస్థలం: స్థానిక ఎంఆర్‌సిలో ఎపియుఎస్ కేలండర్లను ఎంఇఒ త్రినాథరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆపస్ మండల అధ్యక్షులు జి.చిన్నికృష్ణంనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ఎస్.రాజు, జిల్లా కార్యదర్శులు జి.వి.గిరి, ఎం.రవిభట్లు, ఆర్.శ్రీనివాసరావు, ఎం.వేణు పాల్గొన్నారు.

ఆమదాలవలస : ఎస్‌టియు డైరీ కేలండర్‌ను జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీలోని ఆయన స్వగృహంలో ఎస్‌టియు ఉపాధ్యాయుల సమక్షంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వి.రమణమూర్తి, జి.రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ, చింతాడ సూర్యారావు, కె.శ్రీనివాసరావు, చింతల రామారావు, గురువు శ్రీను పాల్గొన్నారు.

మందస : మండలంలోని కొత్తపల్లిలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎం.లక్ష్మణరావు, సొండిపూడి హెచ్‌ఎం ఎస్.సుందర్ సాల్మన్, సిరిపురంలో ఎన్.తారకేశ్వరరావు, కృష్ణాపురంలో డి.వెంకటేశ్వరరావు, మందసలో జె.రవికుమార్, జి.ఆర్.పురంలో ఎస్.ఎర్రన్నాయుడు, బహడపల్లిలో ఎ.కృష్ణమూర్తి, లోహరిబందలో పి.అరుణశ్రీ, అంబుగాంలో సీతమ్మ, బేతాలపురంలో ఉమామహేశ్వరరావు, కెజిబివిలో ప్రిన్సిపాల్ మంగళవారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ కేలండర్, డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గవ్వ భీమారావు, మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.కిరణ్‌కుమార్, కె.సుందరరావు పాల్గొన్నారు.



మందస : కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు

మొక్కలు వితరణ

ప్రజాశక్తి- రణస్థలం

యువత నూతన సంవత్సర వేడుకల పేరుతో కేకులు కత్తిరించే బదులు ఒక మొక్క నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావచ్చని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ కన్వీనర్ ఆర్.హరిబాబు పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం సందర్భంగా టెక్కలి నియోజకవర్గ పరిధిలోని పాఠశాలలు, ఆశ్రమాల ఆవరణలో మొక్కలు నాటడానికి ప్రణాళిక సిద్ధం చేసి వేప, కాగు, తురాయి, బాదం, గంగరావి, బూరుగు, నిద్రగన్నేరు, మామిడి, జామ వంటి 150 మొక్కలను వితరణగా మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేష్, బోరుబద్ర, గ్రామ యువ సామాజిక వేత్త ముద్దపు ఆనందరావు, హరిత సొసైటీ సహకార్యదర్శి బి.లక్ష్మీనరసింహమూర్తి, కె.మహేశ్వరరావు, బి.రామస్వామి, గోవిందరావు పాల్గొన్నారు.



మొక్కను అందజేస్తున్న హరిబాబు

మన్నయ్యపేటలో వైద్య శిబిరం

శ్రీకాకుళం అర్బన్ : నైర వ్యవసాయ కళాశాల జాతీయ సేవాశిబిరంలో భాగంగా మన్నయ్యపేటలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో కె.మన్నయ్యపేట, తురకపేట గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. నైర వ్యవసాయ కళాశాల పిఒలు డాక్టర్లుఎస్.గోవిందరావు, బి.స్పందన పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో మెడికవర్ వైద్యులు ఎం.కోటేశ్వరరావు, పి.చంద్రశేఖర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ కెఅనిల్‌కుమార్, డి.పురుషోత్తం, శర్వాణి పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు